# ఓరుగల్లులో అందగత్తెల సందడి

**రెండు బృందాలుగా యువతుల పర్యటన.. ఒక బృందం వేయి స్తంభాల గుడి సందర్శన**

**కేసీఆర్ హయాంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్పలో మరో బృందం సందడి**



వరంగల్, మే 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనేందుకు హైదరాబాద్‌కు వచ్చిన యువతులు రెండు బృందాలుగా విడిపోయి బుధవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో పర్యటించారు. ఒక బృందం వేయి స్తంభాల గుడిని, ఖిలా వరంగల్‌ను సందర్శించింది. కేసీఆర్ హయాంలో యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప గుడిని మరో బృందం సందర్శించింది. యువతుల పర్యటన నేపథ్యంలో రామప్ప గుడి, వేయి స్తంభాల ఆలయం, ఖిలా వరంగల్‌తోపాటు నగరాన్ని సుందరంగా అలంకరించారు.

**శిల్పకళకు అందగత్తెల అబ్బురం**

వరల్డ్ హెరిటేజ్ దేవాలయంగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప దేవాలయాన్ని సందర్శించిన 20 దేశాలకు చెందిన అందగత్తెల బృందం కాకతీయుల శిల్పకళను, కట్టడాలను తనివితీరా తిలకించి అబ్బుర పడింది. ఆలయ విశిష్టత, చరిత్రను గైడ్‌లు వారికి వివరించారు. పట్టుచీరలు, పట్టు పరికిణలు, నుదుటన బొట్టుతో తెలంగాణ అమ్మాయిల్లా రామప్ప పరిసరాల్లో అందగత్తెలు సందడి చేశారు. మంత్రి సీతక్క సుందరీమణుల పర్యటనను పర్యవేక్షించారు. రాణీ రుద్రమదేవి వేషధారణలో తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ అలేఖ్య పుంజరి ఆధ్వర్యంలో కాకతీయ రాజుల పరిపాలన అంశాలను నృత్య రూపంలో వివరించారు. రంజిత్ పేరిణి నృత్య కళా బృందం 65 మంది పేరిణి కళాకారులతో సత్యం శివం సుందరం, శివ తాండవం ప్రదర్శనను లైట్ అండ్ సౌండ్ షోతో ప్రదర్శించింది.

# కాంగ్రెస్ సర్కారుకు సిగ్గు లేదా?

- అందాల భామలు వస్తున్నరని పేదల గుడిసెలు కూలుస్తరా?
- వారి జీవితాలను భయంకర బుల్డోజర్ల కింద నలిపివేస్తరా?
- బుల్డోజర్ కంపెనీలతో ప్రభుత్వానికి రహస్య ఒప్పందం ఉన్నదా?
- జవాబివ్వు రాహుల్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ) : ప్రపంచ ముద్దుగుమ్మలు వెళ్తున్నారని గుడిసెలు కనిపించకుండా వరంగల్ రహదారి వెంట ఉన్న పేదల గుడిసెలు, జీవనోపాధిని తొలగించడానికి కాంగ్రెస్ సర్కారుకు సిగ్గు లేదా? అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుల్డోజర్ కంపెనీలతో రహస్య ఒప్పందం ఉన్నదా? అని నిలదీశారు. దీనిపై సమాధానం ఇవ్వాలని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీని డిమాండ్ చేశారు. 'ప్రతిరోజూ ప్రజల ఇండ్లను, జీవనోపాధిని ధ్వంసం చేయడానికి ఈ అత్యుత్సాహం వెనుక ఉన్న కారణం ఏమిటి? వరంగల్‌లో ఎందుకు కూల్చివేతలు జరుగుతున్నాయి? మిస్ వరల్డ్ పోటీదారులు ఈ రోజు సందర్శించే మార్గాన్ని అందంగా చేయడానికి గుడిసెలు తొలగిస్తరా? ఇది ప్రజాపాలన అని పిలుచుకోవడం ఎంత దారుణం? ప్యాలెస్‌లలో విలాసవంతమైన విందులు, ప్రజల డబ్బుతో రూ.200 కోట్లకుపైగా వృథాగా ఖర్చు చేసిన తర్వాత కూడా పేద ప్రజల జీవితాలను మీ భయంకర బుల్డోజర్ల కింద నలిపివేయాల్సి వచ్చిందా? ఈ సిగ్గులేని కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నేను సమాధానాలు డిమాండ్ చేస్తున్న' అని ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. బుల్డోజర్లు కూల్చివేసిన తర్వాత శిథిలాలు, కర్రలను ఒకదగ్గరకు చేరుస్తున్న బాధితుల వీడియోలను తన పోస్టుకు జత చేశారు

# పరదాల మాటున పర్యటన

- వరంగల్‌లో అందాల భామల పర్యటన
- మోరీలు కనిపించకుండా పరదాలు
- చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు
- తొలగింపును నిరసిస్తూ బీఆర్ఎస్ ధర్నా

వరంగల్, మే 14(నమస్తే తెలంగాణ ప్రతినిధి): హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న మిస్ వరల్డ్ పోటీలు పేదల పాలిట శాపంగా మారాయి. అందాల పోటీల్లో పాల్గొంటున్న యువతులు బుధవారం వరంగల్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వ్యవహరించిన తీరు విమర్శలకు తావిస్తున్నది. అందాల భామల కంటికి నగర దుస్థితి కనిపించకుండా ప్రభుత్వం రకరకాల ఏర్పాట్లు చేసింది. మోరీలు, మురుగు కాల్వలు కనిపించకుండా అడ్డుగా పరదాలను కట్టించింది. రోడ్ల వెంబడి ఉండే డబ్బాలను బుల్డోజర్లతో తొలగించి దూరంగా జరిపింది. కాజీపేట నుంచి ఫాతిమా జంక్షన్, నిట్, వడ్డేపల్లి, నక్కలగుట్ట, హనుమకొండ చౌరస్తా, వెయ్యి స్తంభాల గుడి, ఎంజీఎం చౌరస్తా, కాశీబుగ్గ ప్రాంతాల్లో రోడ్లపై ఉండే చిరువ్యాపారులను తరిమేశారు. మిస్ వరల్డ్ పోటీల్లో పాల్గొనే యువతుల పర్యటన నేపథ్యంలో నగరంలో ఓపెన్ డ్రైనేజీ, మురుగు కాల్వలు కనిపించకుండా అధికారులు నానా పాట్లు పడ్డారు. మురికి కాల్వలు, డ్రైనేజీల వద్ద బారికేడ్లు, పరదాలను ఏర్పాటు చేశారు.





వరంగల్ ఎంజీఎం సెంటర్ వరకు ర్యాలీగా వెళ్తున్న బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయ్‌భాస్కర్, పార్టీ నాయకులు

**దుకాణాల తొలగింపుపై బీఆర్ఎస్ ధర్నా**

అందాల భామల వరంగల్ పర్యటన సందర్భంగా రోడ్డుపక్కనున్న చిరు వ్యాపారుల దుకాణాల తొలగింపుపై బీఆర్ఎస్ ఆగ్రహం వ్యక్తం చేసింది. దీనిని నిరసిస్తూ బుధవారం గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్ మాట్లాడుతూ నగర చారిత్రక నేపథ్యాన్ని విశ్వవ్యాప్తం చేయడానికి తాము వ్యతిరేకం కాదని, సుందరీమణుల పర్యటనలో పేదల వ్యాపార సముదాయాలను తొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. తొలగించిన డబ్బాలను 48 గంటల్లో పునరుద్ధరించాలని, లేదంటే బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. అనంతరం బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ర్యాలీగా ఎంజీఎం జంక్షన్‌కు చేరుకుని రాస్తారోకో చేశారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ రిజ్వానా షమీమ్ మసూద్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ముందస్తు అరెస్టులు**

ప్రపంచ సుందరీమణుల ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన నేపథ్యంలో బుధవారం బీఆర్ఎస్, బీఆర్ఎస్వీ, ఐద్వా, పీడీఎస్‌యూ, బీజేపీ మహిళా మోర్చా నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు ఎల్లావుల లలితాకుమార్‌యాదవ్, 4వ డివిజన్ అధ్యక్షుడు మనోజ్‌కుమార్, బీఆర్ఎస్వీ నాయకుడు రాజేందర్, దిశ కమిటీ మాజీ సభ్యురాలు భాగ్యలక్ష్మి, మబ్బు రాజు, ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అహల్య, జిల్లా ప్రధాన కార్యదర్శి షబానా, పట్టణ అధ్యక్షురాలు పందిళ్ల కల్యాణిని అదుపులోకి తీసుకొన్నారు.



ప్రపంచ సుందరీమణుల పర్యటన సందర్భంగా వరంగల్‌లోని అలంకార్ మోరీ వద్ద మురుగు కాల్వ కనిపించకుండా కట్టిన పరదాలు



వరంగల్ నిట్ వద్ద సైడ్ డబ్బాలను తొలగిస్తున్న గ్రేటర్ వరంగల్ కార్పొరేషన్ సిబ్బంది

# ..రోజూ రోడ్డెక్కాల్సిందేనా?

మొదటిపేజీ తరువాయి...

విఫలమైందని ఆగ్రహం వ్యక్తంచేశారు. కష్టపడి పండించిన ధాన్యాన్ని అమ్ముకునేందుకు రైతులు ఇబ్బంది పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ధాన్యం కొనుగోలు కోసం రైతులు ప్రతిరోజూ రోడ్డెక్కాల్సిన దుస్థితి దాపురించిందన్నారు. ధాన్యం కాంటా వేయడానికి, మిల్లులకు తరలించడానికి రోజుల తరబడి సమయం పడుతుందా? అని ప్రశ్నించారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం కనిపిస్తున్నదన్నారు. బీఆర్ఎస్ హయాంలో ట్రాన్స్‌పోర్ట్ టెండర్లను పారదర్శకంగా నిర్వహించామని పేర్కొన్నారు. వాహనాలు సకాలంలో పంపకపోతే టెండర్లు రద్దుచేసేవారని గుర్తుచేశారు. అర్హత లేకున్నా కాంగ్రెస్ కార్యకర్తలకు టెండర్లు కట్టబెట్టడంతో ట్రాన్స్‌పోర్ట్ వ్యవస్థ కుప్పకూలిందని ఆరోపించారు. గన్నీబ్యాగుల సరఫరా లేదని, కిందామీదా పడి రైతులు మిల్లులకు ధాన్యం తీసుకువెళ్తే తరుగు తీస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులు ప్రత్యక్షంగా దోపిడీకి గురవుతున్నారని పేర్కొన్నారు. అకాల వర్షాలకు ధాన్యం తడిసి కొట్టుకుపోతుంటే సర్కారుకు చీమ కుట్టినట్టు అయినా లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తడిసిన, కొట్టుకుపోయిన ధాన్యానికి ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

**అందాల భామల కాళ్లు కడిగిస్తారా?**

వరంగల్‌లో పర్యటిస్తున్న అందాల భామల కాళ్లను తెలంగాణ మహిళతో కడిగించడం యావత్ తెలంగాణ సమాజానికే అవమానకరమని మండిపడ్డారు. కాంగ్రెస్ ఏడాదిన్నర పాలన పాపాలకు ఇది పరాకాష్ట అని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ సర్కారు తెలంగాణ మహిళలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పంటల కొనుగోళ్లను గాలికొదిలేసి అందాల పోటీలు నిర్వహించడం అవివేకమని దుయ్యబట్టారు. హైదరాబాద్‌ను రెడ్‌జోన్‌గా ప్రకటించినా అందాల పోటీల కోసం చార్మినార్ వద్ద దుకాణాలు మూసివేయించి, క్యాట్‌వాక్‌లు నిర్వహించడంపై మండిపడ్డారు.

**అభాగ్యుల పొట్ట కొట్టిన కాంగ్రెస్**

అందాల భామల వరంగల్ పర్యటన కోసం అక్కడి ఫుట్‌పాత్ మీద వ్యాపారాలు చేసుకుని జీవిస్తున్న అభాగ్యుల పొట్ట కొట్టారని ఆగ్రహం వ్యక్తంచేశారు. గతంలో అప్పుల తెలంగాణ అని అవమానించిన కాంగ్రెస్ వారే ఇప్పుడు అడ్డగోలుగా అప్పులు తెచ్చుకుంటూ విచ్చల విడిగా ఖర్చులు చేస్తున్నారని దుయ్యబట్టారు. అందాల పోటీలతో ప్రజల సొమ్ము హారతి కర్పూరంలా ఖర్చు కావడం తప్ప తెలంగాణకు ఒరిగేదేమీ లేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు.



నాగర్‌కర్నూల్‌లోని ప్రధాన రహదారి పక్కన అక్రమంగా నిర్మించారని దుకాణ సముదాయాన్ని జేసీబీతో కూల్చివేయిస్తున్న అధికారులు

# చిరువ్యాపారులపై బుల్డోజర్

**పోలీసు బందోబస్తు మధ్య దుకాణాల కూల్చివేత**

**నాగర్‌కర్నూల్‌లో ఆక్రమణల తొలగింపు ఉద్రిక్తం**

నాగర్‌కర్నూల్, మే 14 : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని రోడ్డుకిరువైపులా ఉన్న పలు చిరువ్యాపారుల దుకాణాలను మున్సిపల్, రెవెన్యూ అధికారులు తొలగించారు. సమాచారం ఇవ్వకుండా కూల్చి వేస్తున్నారంటూ వ్యాపారులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. మున్సిపల్ పరిధిలోని ఉయ్యాలవాడ నుంచి కొల్లాపూర్ చౌరస్తా వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా, నల్లవెల్లి రోడ్డులో ఆక్రమణలు ఉన్నట్టు అధికారులు గుర్తించారు. స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా బుధవారం ఆర్డీవో కార్యాలయం నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు పండ్లు, టిఫిన్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, చాయ్ దుకాణాలను జేసీబీతో కూల్చివేశారు. రేకుల షెడ్లను, తడకలను పోలీస్ బందోబస్తు మధ్య మున్సిపల్, రెవెన్యూ అధికారులు కూల్చివేశారు. వ్యాపారాలు నిర్వహిస్తుండగానే తొలగింపు పనులు చేపట్టడంతో పలువురు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమాచారం లేకుండా తొలగించడమేమిటని నిలదీశారు. తాము రోడ్డున పడ్డామని పలువురు చిరువ్యాపారులు వాపోయారు. వారం ముందుగానే చిరువ్యాపారులకు సమాచారం అందించామని, పట్టించుకోకపోవడంతో తొలగిస్తున్నట్టు మున్సిపల్ అధికారులు తెలిపారు.

- **ఆర్మీ జాయింట్ కమాండర్‌గా మెట్‌పల్లి వాసి**



మెట్‌పల్లి, మే 14 : ఝాన్సీ కంటోన్మెంట్ ఆర్మీ జాయింట్ కమాండర్ (కమాండ్ అధికారి)గా జగిత్యాల జిల్లా మెట్‌పల్లి పట్టణానికి చెందిన ఆకుల ఆనంద్ ఉద్యోగోన్నతి పొందారు. వ్యవసాయ కుటుంబానికి చెందిన ఆకుల లక్ష్మి, నర్సయ్య దంపతుల పెద్ద కుమారుడైన ఆనంద్.. 2005లో ఆర్మీకి ఎంపికయ్యారు. 20 ఏండ్లుగా ఢిల్లీ, జమ్ముకశ్మీర్, ఝాన్సీ, హర్యానా, ఛండీగఢ్, లేహ్, లద్దాక్ కంటోన్మెంట్‌లలో వివిధ హోదాల్లో పనిచేశారు. తాజాగా ఝాన్సీ ఆర్మీ జాయింట్ కమాండర్‌గా ఉద్యోగోన్నతి పొంది బుధవారం బాధ్యతలు చేపట్టారు. దేశం కోసం ఆర్మీలో చేరి అంచెలంచెలుగా జాయింట్ కమాండర్ స్థాయికి ఎదగడంపై కుటుంబసభ్యులు, బంధువులు హర్షం వ్యక్తంచేస్తున్నారు.

# అందాల పోటీల కోసం కడుపులు కొట్టాలా?

- అందమంటే పేదల ఇండ్లు కూల్చడం కాదు
- కూల్చివేత బాధితులకు పరిహారమివ్వాలి
- ఎస్-400 మిస్సైల్‌లా పేదలకు కేటీఆర్ అండ
- సర్కార్‌పై తీరుపై ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆగ్రహం



హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): అందాల పోటీల నిర్వహణ కోసం రోడ్డు పక్కన ఉండే చిన్న ఇండ్లు, దుకాణాలు కూల్చడం ఏమిటని? వాళ్ల కడుపులు కొట్టడం ఎందుకని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్రంలో ఏదో ఒక మూల కూల్చడం రేవంత్ సర్కారుకు అలవాటుగా మారిందని ధ్వజమెత్తారు. బుధవారం తెలంగాణ భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన పిచ్చోడి చేతిలో రాయిలా మారిందని ధ్వజమెత్తారు. అందాల భామలు వస్తారని వరంగల్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లో రోడ్డు పక్కనున్న పేదల షాపులను కూల్చడం ఏంటని మండిపడ్డారు. ఓరుగల్లు చారిత్రక నగరమని, ఎవరి మెప్పుకోసం ప్రజలను ఏడిపిస్తున్నారని ప్రశ్నించారు. సుపరిపాలన, సంక్షేమ పథకాలు, అభివృద్ధి, ప్రజల సుఖశాంతులతో రాష్ట్రానికి అందం వస్తుందని పేర్కొన్నారు.

**ఎస్- 400 మిస్సైల్‌లా ప్రజలకు కేసీఆర్ అండ**

రేవంత్ సర్కారు వచ్చినప్పటి నుంచి రాష్ట్రంలో కట్టడాల కంటే కూల్చడాలే ఎక్కువయ్యాయని రాకేశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. హైడ్రా, మూసీ, లగచర్ల, హెచ్‌సీయూ, వరంగల్, నాగర్ కర్నూల్‌లో పేదలపై దాడి చేస్తున్నారని దుయ్యబట్టారు. ఎస్-400లా ప్రజలకు కేటీఆర్ అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. రైతు బంధుకు డబ్బులు లేవంటూనే అందాల పోటీలకు రూ.200 కోట్లు ఎలా ఖర్చు పెడుతున్నారని, అబద్ధాలు చెప్పి ఆకాశంలో విహరిస్తే ప్రభుత్వానికి వచ్చేది అందం కాదని, చెడ్డపేరు అని దుయ్యబట్టారు. అందాల పోటీలతో వచ్చే లాభం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు.

**ఈ-ఫార్ములా వల్ల 700 కోట్లు పెట్టుబడులు**

కేటీఆర్ తెచ్చిన ఈ-ఫార్ములా రేసు వల్ల రాష్ట్ర ప్రతిష్ఠ పెరిగిందని, రాష్ట్రానికి రూ.700 కోట్లు పెట్టుబడులు వచ్చాయని తెలిపారు. అద్భుతమైన ఫార్ములా రేసును కాంగ్రెస్ సర్కారు వచ్చీ రాగానే రద్దు చేయడం బాధాకరమన్నారు. హైదరాబాద్‌కు రెడ్ అలర్ట్ మెసేజ్‌లు వచ్చినా వాటిని లెక్క చేయకుండా అందాల పోటీలు నిర్వహించడం దారుణమన్నారు. రాష్ట్రంలో ధాన్యం నీళ్ల పాలవుతున్నా పట్టించుకునే నాథుడే లేకుండా పోయాడని ఆవేదన వ్యక్తంచేశారు. ప్రభుత్వం కండ్లు తెరిచి రైతాంగంపై దృష్టి పెట్టాలన్నారు. ప్రభుత్వం కూల్చివేతలు నిలిపివేసి, బాధితులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

## ఏజెన్సీ ఎంపికపై గోప్యత!

- *అందాల పోటీల నిర్వహణ సంస్థను ఎలా ఎంపిక చేశారు? ఎంత చెల్లించారు?*
- *ఆర్టీఐ ప్రశ్నకు సమాధానమివ్వని సర్కారు*

*హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): హైదరాబాద్‌లో అట్టహాసంగా జరుగుతున్న మిస్ వరల్డ్ పోటీల నిర్వహణ సంస్థ ఎంపికపై రాష్ట్ర ప్రభుత్వం నోరు మెదపడం లేదు. ఏ పద్ధతి ప్రకారం ఏజెన్సీని ఎంపిక చేశారు? ఆ ఏజెన్సీకి ఎంత చెల్లించారని అడిగితే ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. అందాల పోటీల ఖర్చు, నిర్వహణ సంస్థ ఎంపిక, ఇతర అంశాలపై రంగారెడ్డి జిల్లాకు చెందిన గౌతమ్‌గౌడ్ ఆర్టీఐ కింద అడిగిన ఆరు ప్రశ్నలకు తెలంగాణ టూరిజంశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బుధవారం అరకొర సమాధానాలిచ్చారు. హైదరాబాద్ వేదికగా ఈ నెల 10 నుంచి నెలాఖరు వరకు జరిగే ప్రపంచ సుందరి (మిస్ వరల్డ్) పోటీలను ఏ సంస్థ నిర్వహిస్తున్నదన్న ప్రశ్నకు యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన మిస్ వరల్డ్ లిమిటెడ్ అని తెలిపారు. ఏ పద్ధతి ప్రకారం ఈ ఏజెన్సీని ఎంపిక చేశారు? ఏజెన్సీకి ఎంత చెల్లించారని అడిగితే ప్రభుత్వం ఎలాంటి సమాధానం ఇవ్వలేదు. నిర్వహణ సంస్థతో చేసుకున్న కాంట్రాక్టు/అగ్రిమెంట్ కాపీలు ఇవ్వాలని కోరగా ఆర్టీఐ యాక్ట్ సెక్షన్ 8(1)డీ ప్రకారం సమాచారం ఇవ్వబోమని తెలిపారు. అందాల పోటీలకు మొత్తం ఎంత ఖర్చు వస్తుందని అంచనా వేస్తున్నారని అడగ్గా, మొత్తం రూ.54 కోట్లు అని, పోటీలు నిర్వహిస్తున్న రాష్ట్రం సగం భర్తిస్తుందని, అంటే రూ.27 కోట్లు అని తెలిపారు. నిర్వహణ ఖర్చులు, రాష్ట్రానికి వచ్చే ప్రయోజనాలకు సంబంధించిన ఏమైనా డీపీఆర్ ఉన్నదా? అన్న ప్రశ్నకూ సమాధానం దాటవేశారు. అందాల పోటీలు హైదరాబాద్‌లో నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయించిందని పేర్కొన్న అధికారులు.. పోటీల నిర్వహణ నిర్ణయానికి సంబంధించిన నోట్ షీట్ ఏమైనా ఉన్నదా? అన్న ప్రశ్నకూ సమాధానం దాటవేశారు.*

## నిరసన తెలిపితే నిర్బంధాలా?

- హక్కులపై దాడి ప్రజాస్వామ్యం కానేకాదు
- అందాల పోటీలపై వివిధ సంఘాల ఆగ్రహం

హైదరాబాద్, మే 14 (నమస్తే తెలంగాణ): మిస్ వరల్డ్-2025 పోటీలకు వ్యతిరేకంగా నిరసన తెలిపే మహిళల హక్కుపై తెలంగాణ ప్రభుత్వం దాడి చేస్తున్నదని అందాల పోటీల వ్యతిరేక పోరాట వేదిక మండిపడింది. ప్రభుత్వం అప్రజాస్వామిక పద్ధతిలో అరెస్టులకు, గృహ నిర్బంధాలకు పాల్పడుతున్నదని వివిధ సంఘాల ప్రతినిధులు విమర్శించారు. బుధవారం ఉదయం పోలీసులు పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య ఇంటిని చుట్టుముట్టారని తెలిపారు. మే 10న నిరసన తెలిపిన వారిపై పోలీసులు క్రూరంగా ప్రవర్తించారని మండిపడ్డారు. సూర్యాపేట, నల్లగొండ, మిర్యాలగూడ, హైదరాబాద్ జిల్లాల పోలీసులు పీవోడబ్ల్యూ, ఐద్వా, పీవైఎల్ కార్యకర్తలను అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. కార్పొరేట్ ప్రయోజనాల కోసమే అందాల పోటీలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. మహిళా సంఘాల పట్ల వ్యవహరించిన తీరును తీవ్రంగా ఖండిస్తున్నట్టు పీవోడబ్ల్యూ నాయకురాలు సంధ్య తెలిపారు. తాము నిజమైన మహిళా సాధికారతను కోరుతున్నామని ఝాన్సీ పేర్కొన్నారు.

# ఆత్మగౌరవం తాకట్టు

మొదటిపేజీ తరువాయి...

టవల్‌ను ఎదురుగా ఉన్న మహిళకు ఇచ్చారు. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె కాళ్లు తుడవాల్సి వచ్చింది. ఈ ఘటనపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తెలంగాణ సంస్కృతిలో ఇంటికి వచ్చిన అతిథికి కాళ్లు కడుక్కునేందుకు నీళ్లు ఇవ్వడం ఆనవాయితీ అని, ఇలా కాళ్లు తుడిపించడం ఏమిటని మండిపడుతున్నారు. ఇది తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి భంగం కలిగించడమేనని స్పష్టం చేస్తున్నారు. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారడంతో పాటు దేశవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ఇంత దారుణమా? అంటూ పోస్టులు పెడుతున్నారు.



**ఇదేం మర్యాద?**

తెలంగాణ ఆడబిడ్డతో కాళ్లు తుడిపించడంపై విమర్శలు వెల్లువెత్తడంతో కాంగ్రెస్ నేతలు కవరింగ్ మొదలు పెట్టారు. 'ప్రపంచ అందగత్తెల పోటీదారులు తెలంగాణ సంప్రదాయాన్ని, సంస్కృతిని పాటించేలా మన ఆడపడుచులు చేశారు. మర్యాదకు, బానిసత్వానికి తేడా ఉంది' అంటూ కాంగ్రెస్ నేత సామ రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. దీంతో ఆయన వ్యాఖ్యలపై నెటిజన్లు ఫైర్ అవుతున్నారు. 'గుడిలోకి పోయేముందు ఇత్తడి పల్లెంలో కాళ్లు కడిగి, తుడిచే సంప్రదాయం ఎక్కడున్నది?' అని కౌంటర్లు వేస్తున్నారు. 'మన సంప్రదాయం చూపించాలంటే కాళ్లు కడిగి తుడవడం ఏమిటి?. ఇదేం మర్యాద?' అని ప్రశ్నిస్తున్నారు. ఈ చర్య బానిస మనస్తత్వాన్ని ప్రతిబింబుస్తున్నదని విమర్శిస్తున్నారు. మరోవైపు అందాల భామల పర్యటనలో పోలీసు శాఖ కింది స్థాయి సిబ్బందితో నీళ్లు అందించే పనులు చేయించారని స్థానికులు చెప్తున్నారు. రక్షణ విధులు నిర్వహించాల్సిన సిబ్బందితో నీళ్లు మోపిస్తారా? అంటూ మండిపడుతున్నారు.

## ముగిసిన ఆపరేషన్ కగార్!

**కర్రెగుట్టల్లో 21 రోజులపాటు కొనసాగిన కూంబింగ్**

**31మంది మావోయిస్టుల మృతదేహాలు స్వాధీనం.. ఛత్తీస్‌గఢ్ పోలీసుల వెల్లడి**

కొత్తగూడెం ప్రగతి మైదాన్, మే 14: తెలంగాణ- ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో 21 రోజులపాటు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' ముగిసినట్టు తెలిసింది. బస్తర్ రేంజ్ ఐజీ సుందర్‌రాజ్ పాటిలింగ్ నేతృత్వంలో సీఆర్పీఎఫ్ సారథ్యంలో ఈ ఆపరేషన్ నిర్వహించారు. తెలంగాణలోని ములుగు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని బీజాపూర్ జిల్లాల్లో విస్తరించి ఉన్న దట్టమైన అడవుల్లో ఎత్తయిన కర్రెగుట్టల్లో మావోయిస్టుల కోసం 21 రోజులపాటు 'ఆపరేషన్ కగార్' నిర్వహించినట్టు ఛత్తీస్‌గఢ్ పోలీసు ఉన్నతాధికారులు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో జరిగిన ఎదురు కాల్పుల్లో 31 మంది మావోయిస్టులు మృతిచెందినట్టు పేర్కొన్నారు. 28 మృతదేహాలను గుర్తించామని, వీరి పేరిట రూ.1.72 కోట్ల రివార్డు ఉన్నదని తెలిపారు.